# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 121 | వరంగల్ | బుధవారం, 21 జనవరి 2026 | పేజీలు : 02



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745




# మేడారంలో మొక్కులు

- వనదేవతలను దర్శించుకున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

**పాలకుర్తి వాణి, ములుగు :** ములుగు జిల్లా తడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు అమ్మవార్లకు ఎత్తు బంగారం మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఎంపీ, ఎమ్మెల్యే కు ఆలయ పూజారులు అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నూతన వైభవాన్ని సంతరించుకుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వెయ్యి సంవత్సరాల పాటు నిలిచిపోయేలా గద్దెల ప్రాంగణాన్ని





ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా పునర్నిర్మాణం చేయడం మహా అద్భుతంగా ఉందని కొనియాడారు. మేడారం మహా జాతరను ఇంత గొప్పగా అభివృద్ధి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన, ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన బిడ్డల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 250 కోట్లతో మేడారంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. అడవి తల్లుల చరిత్రను చాటి చెప్పేలా, కోయ సంస్కృతికి అద్దం పట్టే విధంగా అనేక శిల్పాలు, బొమ్మలు రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు జాతర సమయంలో మాత్రమే భక్తులు వచ్చేవారని, ప్రస్తుతం ఏడాది పొడవునా భక్తులు వస్తుండటంతో శాశ్వత ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు.



# తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి

- సీఎంతో గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా భేటీ
- ట్రాఫిక్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, వ్యవసాయం, క్లైమేట్ చేంజ్ రంగాల్లో సహకారం

**పాలకుర్తి వాణి, హైదరాబాద్:** దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో సీఎం రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న CURE, PURE, RARE అభివృద్ధి నమూనాను రేవంత్ రెడ్డి వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలు, ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్బును హైదరాబాద్లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు








# తొర్రూరు పట్టణంలో ఎమ్మెల్యే బిజీ బిజీ

- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని భరోసా

**పాలకుర్తి వాణి, తొర్రూరు టౌన్ :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి రోజంతా పర్యటించారు. బిజీ బిజీగా స్థానికులు కార్యకర్తలతో గడిపారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి ఆప్యాయంగా మాట్లాడారు. 11వ వార్డులో దోబీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు శాశ్వత వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో టి.యు. ఎఫ్.ఐ.డి.సి (TUFIDC) నిధుల నుండి మంజూరైన రూ.2 కోట్ల వ్యయంతో దోబీ ఘాట్ భవనం ను నిర్మించారు. నూతనంగా నిర్మితమైన ఈ దోబీ ఘాట్ భవనాన్ని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 10వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో పద్మశాలి కమ్యూనిటీ భవనంను ప్రారంభించారు. రూ.30 లక్షల వ్యయంతో వివేకానంద కమ్యూనిటీ భవనాన్ని సైతం ప్రారంభించారు. 07వ వార్డులో రూ.45 లక్షల వ్యయంతో విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని యశస్విని రెడ్డి ప్రారంభించారు. 02వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. 6వ వార్డులో రూ.1 కోటి వ్యయంతో SC కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు.



# రాజకీయ వేధింపులే కాంగ్రెస్ ఎజెండా

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**పాలకుర్తి వాణి, వరంగల్ :** రాజకీయ వేధింపులే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండాగా మారిపోయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు అని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా కేసును కూడా కొట్టేసిందన్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతోనే ఈ డ్రామా ముగిసిపోయినా, మళ్లీ హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ ఎంత దిగజారిందో అర్థమవుతోందని విమర్శించారు.ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ తప్ప మరొకటి కాదన్నారు. హరీశ్ రావు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడటంలో కానీ ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని,అందుకే రాజకీయంగా ఆయనను ఎదుర్కోలేక, ఇలాంటి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. గత 24 నెలలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఈ దారుణమైన పాలనను నిలదీస్తున్నందుకే హరీశ్ రావును టార్గెట్ చేస్తూ ఈ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. తమకు చట్టం పైన, న్యాయస్థానాల పైన పూర్తి గౌరవం ఉందని.. ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. 'విచారణల పేరుతో, నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూస్తే అది మీ భ్రమ మాత్రమే. మీరు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని వేధింపులకు గురిచేసినా ప్రజల పక్షాన మిమ్మల్ని వేటాడడం ఆపేది లేదు. మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం, మిమ్మల్ని అడుగడుగునా ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయి లో ఉండి పార్టీ జెండా గద్దెలు కూలగొట్టాలనడం సిగ్గుచేటు చర్య' అని వెల్లడించారు.

## ఘనంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి
# ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు



**పాలకుర్తి వాణి, పాలకుర్తి టౌన్ :** మాఘ శుద్ధ విదియ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పాలకుర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జనగాం జిల్లా పాలకుర్తి పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు రాపాక రఘు సారథ్యంలో స్థానిక శ్రీ ఓంకారేశ్వర దేవాలయం (పంచగుళ్లు)లోని అమ్మవారి సన్నిధిలో శ్రీ గంగు రఘు శర్మ నేతృత్వంలో విశేష కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో భరత్ అయ్య, ఆర్య వైశ్య మహాసభ జిల్లా, మండల, పట్టణ నాయకులు, మహిళా లు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**జెడ్పి సీఈవో డి పురుషోత్తం**

**పాలకుర్తి వాణి, మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పి సీఈవో డి పురుషోత్తం అన్నారు. మంగళవారం మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో మెప్మా ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ 14 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మరిపెడ కమిషనర్ రామడుగు విజయనాథ్ తో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో వీధివిక్రియ దారులకు ప్రభుత్వం నుండి 1216 మంది మహిళలకు సుమారు కోటి 24 వేల రూపాయలు లోన్ ఇప్పించడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వ వారికి చేయూతనుఅందిస్తుందన్నారు. మహిళా సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేయకుండాఉపయోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ విజయలక్ష్మి, సెమీమ్, పులి ఉమా, గంధసిరి ఉమా, రాజేశ్వరి, రజిత, పార్వతి, ఉమారాణి, లక్ష్మి, స్వరూప, సరిత, మమత, తోపాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన పై సమీక్ష

**పాలకుర్తి వాణి, జనగామ :** ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన (PMDDKY) అమలు పై కేంద్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ ఆఫీసర్ రిషి కాంత్, (జాయింట్ సెక్రటరీ, గవర్నమెంట్ అఫ్ ఇండియా) జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా గతం లో రూపొందించిన 6 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక (Action Plan) మండల స్థాయిలో లక్ష్యాల సాధనపై ) వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు.

**ఆయిల్ ఫామ్ సాగుపై క్షేత్రస్థాయి సందర్శన**

అనంతరం పలు మండలాల్లో జరిగిన క్షేత్ర సందర్శన లో భాగంగా.. నర్మెట్ట మండలానికి చెందిన ఆయిల్ ఫామ్ రైతుల క్షేత్రాలు సందర్శించి, పంట సాగు తీరు, ఉత్పత్తి, మార్కెటింగ్ సౌకర్యాల గురించి రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గుంటూరు పల్లికి చెందిన వేలంగనీ రెడ్డి కి సంబందించిన డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ హైదరాబాద్ కు చెందిన డాక్టర్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ , జిల్లా ఉద్యానవన అధికారి రవికాంత్ , రాష్ట్ర ఆయిల్ ఫెడ్ అధికారులు ప్రవీణ్ రెడ్డి , శంకర్ , ada వసంత సుగుణ ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.





# ఎస్ఎఫ్ఐ క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎస్సై

**పాలకుర్తి వాణి, దేవరుప్పల :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలకేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఎఫ్ఐ నూతన క్యాలెండర్ ను ఎస్సై ఊర సృజన్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని అన్నారు. దేశాభివృద్ధికిపాటు పడాలని,విద్యార్థులది కీలకపాత్ర అని,అలాంటి విద్యార్థులు డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి అన్నారు..ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ, ఏఎస్ఐ సదానందం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో కండక్టర్ మృతి



**పాలకుర్తి వాణి, నర్సంపేట :** వరంగల్ జిల్లా నర్సంపేట బస్ డిపోలో కండక్టర్ గా పనిచేస్తున్న బొమ్మ రాజ్ కుమార్ (42) బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు. మృతునికి రావలసిన శాఖాపరమైన పరిహారం వెంటనే చెల్లించాలని భార్యా పిల్లలు బంధువులతో నర్సంపేట బస్టాండ్ లో మంగళవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. నాలుగు నెలల క్రితం హన్మకొండ నుండి నర్సంపేట బస్సులో డ్యూటీ చేస్తున్న క్రమంలో ఒక టికెట్ కొట్టలేదని అధికారులు రాజ్ కుమార్ ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లరి గూడ గ్రామానికి చెందిన రాజకుమార్ 2010 నుండి కండక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. వారం క్రితం పూర్తిగా సర్వీస్ రిమూవ్ చేయడంతో మానసిక ఒత్తిడితో మృతి చెందాడంటూ బస్టాండ్లో మృతదేహంతో మృతుడి బంధువుల ఆందోళన కు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడు బొమ్మ రాజశేఖర్ భార్య భవాని, మృతుడి ఇద్దరు పిల్లలు డిమాండ్ చేస్తున్నారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఆధ్య(9), అభినందన్(7) ఉన్నట్లు తెలిపారు. బంధువుల ద్వారా బస్ స్టాండ్ లో ఎలాంటి అవాంఛనీయ జరగకుండా నర్సంపేట ఎస్సైలు రవికుమార్, అరుణ్ కుమార్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసి, మృతిని బంధువులతో మాట్లాడి ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సకాలంలో శాఖపరమైన బెనిఫిట్స్ ఇప్పించడానికి కృషి చేస్తామని తెలిపారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341